# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

**నిన్న రెండుసార్లు** ఫోన్ చేశాడు. ఇప్పుడు ఈ ఈ–మైల్ చేశాడు. అతనికి తను విడాకులు ఇచ్చినా కూడా ఇలా ఎందుకు వెంటపడుతున్నాడో ఆమెకు అర్ధంకాలేదు.

మధు పంపించిన ఈ–మైల్ చూడకుండా డిలీట్ చేయబోయి, తర్వాత చూద్దాంలే అని ఆ పని చేయలేదు.

నిక్ వద్దనించీ ఫోన్ వచ్చిందేమో అని చూస్తూ, అసంకల్పితంగానే అతనికి ఫోన్ చేసింది.

అతను ఫోన్ తీయలేదు.

'ఇడియట్, ఏమయింది నీకు' అనుకున్నది.

అందర్నీ తేరిపార చూస్తూ లంచ్ చేయటం తనకి ఇష్టం వుండదు. అక్కడ తనతో మాట్లాడే వాళ్ళు కూడా ఎవరూ లేరు.

అశోక్ ఎక్కడికి వెళ్ళాడో?

ఆ బంగ్లాదేశ్ అమ్మాయితో కలిసి బయటికి వెళ్ళాడేమో!

ఇక ఏమీ తోచక, టొమాటో సూప్ తాగుతూ మధు పంపించిన ఈ–మైల్ చూసింది.

అతనికి అట్లాంటాలో ఉద్యోగం వచ్చిందిట. ఇండియాలో తన పదేళ్ళ అనుభవం కూడా చూసి, మంచి జీతమే ఇచ్చారుట. తన స్నేహితుడే కారు డ్రైవింగ్ నేర్పించాడనీ, అతని దగ్గరే వుంటున్నాననీ, త్వరలో తనకి వేరే ఎపార్ట్మెంటు తీసుకుంటాననీ, కారు కొనుక్కుంటాననీ వ్రాశాడు. ఇవన్నీ తన కెందుకు చెబుతున్నాడు అనుకుంది సమీర. దాని క్రింద ఆ సంతోషకరమైన వార్తను పంచుకోటానికి నాకు అమెరికాలో వేరే ఎవరూ లేరు కనుక మామగారికి, అంటే తన నాన్నగారికి

చెప్పాననీ, ఆయన చాలా సంతోషించారనీ వ్రాశాడు. సమీరతో కూడా ఈ శుభవార్త పంచుకుందామనే సదుద్దేశ్యంతోనే ఈ ఈ–మైల్ వ్రాస్తున్నానని వ్రాశాడు.

‘గుడ్ ఫర్ హిమ్’ అనుకుంది సమీర.

అతనికి జవాబు ఇవ్వవలసిన అవసరం కూడా లేదు అనుకున్నది, ఆ ఈ–మైల్ డిలీట్ చేస్తూ.

సాయంత్రం దాకా కూడా నిక్ దగ్గరనించీ జవాబు లేదు.

అలా ఒక్కసారిగా తనతో మాట్లాడటం ఆపేయటానికి అతని ఆంతర్యం ఏమైవుంటుంది అనుకుంది.

మళ్ళీ ఇంకో కోణంలో చూస్తూ, అవును అతనెవరు? అతను తననెందుకు పట్టించుకోవాలి? తన స్నేహితురాలి భర్తకు చుట్టం. ఒక చిన్న సహాయం కావాల్సి వచ్చింది. అతను అడిగినది పూర్తి చేశాడు. వెళ్లిపోయాడు. మరి?

అలా అనుకుంది కానీ, ఎందుకో తన మనసు ఒప్పుకోవటం లేదు.

బద్ధకంగా వుండి ఎపార్టుమెంటుకి వచ్చాక మళ్లీ బయటికి వెళ్ళలేదు. రూముకి వచ్చేటప్పుడే ఒక యాపిల్, కాసిని బ్లూబెర్రీలు తెచ్చుకుంది. అవి తిని మంచం మీద వ్రాలి కాసేపు అమెరికాలోని తల్లితో మాట్లాడింది. ఆవిడకి మధ్యాహ్న సమయం కనుక ఎవరినో కలవటానికి వెడుతున్నానని చెప్పి ఫోన్ పెట్టేసింది.

తీరిగ్గా మాట్లాడదామనుకుంటే స్నేహితులే లేరు అనుకుంటూ, కాసేపు టీవీ చూసి నిద్రలోకి జారుకుంది సమీర.

8

“నాకీరోజు ఆఫీసులో ఆడిట్ వుంది. మధ్యాహ్నం లాయర్ దగ్గరకు నిన్ను వీణ తీసుకు వెడుతుంది. ఫరవాలేదా?” అడిగాడు వేణు రేఖని.

“ఫరవాలేదు అంకుల్. అక్కడ ఏమయిందో మీకు నేను మెనేజ్ చేస్తాను. మీరు వెళ్ళండి. ఇప్పుడే లాసేంజలస్లో సోషల్ వర్కర్ కాంతిమతి శ్రీనివాసన్ని పిలిచి మాట్లాడతాను” అంది రేఖ.

సరే అని వేణు ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

వెడుతూ అనుకున్నాడు, ‘రేఖ మంచి తెలివైన అమ్మాయే కాదు, పనులు చేయటంలో కూడా దిట్ట’ అని.

కాంతిమతిని ఫోన్లో పిలిచింది రేఖ.

తనని పరిచయం చేసుకుని, ఇలా ప్రకాష్ అంకుల్ చెబితే పిలుస్తున్నానన్నది.

"అవును. ప్రకాష్ నాకు బాగా తెలుసు. మంచివాడు. ఏమిటి ఎలా వున్నావ్? ఏం జరిగిందో వివరంగా చెప్పమ్మా" అని ఆప్యాయంగా అడిగింది.

రేఖ పెళ్ళి సంబంధం కుదిరినప్పటినించీ ఇప్పటిదాకా జరిగినదంతా చెప్పింది. ఇప్పుడు తను ఎక్కడ వున్నదీ చెప్పింది. ఏదైనా మంచి సెక్యూరిటీ వున్న గేటెడ్ ఎపార్ట్మెంటు కోసం వెతికి, అది దొరకగానే అక్కడికి వెళ్ళిపోతాను అంది. మధ్యాహ్నం లాయర్ మైకేల్ కార్సన్ దగ్గరికి వెడుతున్నానని చెప్పింది.

"నాకు లాయర్ కార్సన్ బాగానే తెలుసు. శాండియాగోలో ఫామిలీ లా ప్రాక్టీస్ చేసేవాళ్ళు ముగ్గురు, నలుగురు తెలుసు. అందులో కార్సన్ ఒకరు. మంచివాడు. మాకు ఇలాటి గృహహింస కేసులేవైనా మీ వూరినించీ వస్తే వాళ్ళు సహాయం చేస్తుంటారు. నా పేరు చెప్పు తన చార్జీల్లో కనీసం గంటకి ఒక యాభై అయినా తగ్గిస్తాడు" అంది.

రేఖతో ఆ లాయర్ ద్వారా ఏమేం చేయాలో, ఎలా చేయాలో చెప్పింది.

"మధ్యాహ్నం ఆయనతో ఫీసు విషయం మాట్లాడాక నువ్వు మొట్టమొదట చేయాల్సింది రిస్ట్రయినింగ్ ఆర్డర్ తీసుకోవటం అవసరం. దాన్నే ప్రొటెక్టివ్ ఆర్డర్ అని కూడా అంటారు. వాసుగానీ, అతని తల్లిదండ్రులుగానీ నీ దరిదాపుల్లోకి కనీసం పదిమైళ్ళు లోపల రాకూడదని చేయమను. అది సులభంగా వస్తుంది. నీ సెల్ఫోనులో అతనూ, అతని కజినూ నిన్ను కూడా కలుపుకుని వ్రాసుకున్న మెసేజీలు చూపించు. ఆయనే వాటిని ప్రింటు తీసుకుంటాడు. దాని తర్వాత విడాకులు, అతని మెంటల్ పరిస్థితినిబట్టి నీ కూతురుని పూర్తిగా నీ కంట్రోల్లోనే వుంచేటట్లు, అతనికి కూతురుని చూసే హక్కు లేకుండా చూడమను. అమ్మాయి పెరిగి పెద్దయేదాకా నెలనెలా ఆలిమోనీ కానీ, ఒకే పెద్ద మొత్తంగా కానీ వచ్చేటట్లు చూస్తాడాయన. నీకు ఇంకా ఏమైనా అనుమానాలుంటే నాకు ఫోన్ చేయి. నీకేం భయం లేదు. ధైర్యంగా వుండు. ఇలాటి గృహహింసలు చేసే వాళ్ళు సభ్య సమాజంలో కాదు వుండాల్సింది, జైళ్ళల్లో!" అంది కాంతిమతి.

ఆవిడకు ధన్యవాదాలు చెప్పి ఫోన్ పెట్టేసింది రేఖ.

మధ్యాహ్నం ఇచ్చిన టైముకే లాయర్ కార్సన్ ఆఫీసుకి వెళ్ళింది రేఖ.

రేఖని అక్కడ దించి "నేను ఇక్కడే ఇండియన్ గ్రోసరీ షాపుకి వెళ్ళి ఒక గంటలో వస్తాను. ఇద్దరం కలిసి ఇంటికి వెడదాం. షాపునించీ నీకేమైనా కావాలా?" అడిగింది వీణ.

"ఏమీ వద్దు ఆంటీ. ఇప్పటికే మీకు శ్రమ ఇస్తున్నాను" అంది.

"శ్రమ ఏముంది, నువ్వూ మా అమ్మాయివే" అంది వీణ నవ్వుతూ.

లా ఆఫీస్ యాడ్మిన్ ముందు ఫీజు గురించి మాట్లాడింది. రేఖ అంత ఇచ్చుకోవటం కష్టం అని చెప్పి, కాంతిమతి శ్రీనివాసన్ ఇక్కడికి పంపించిందని చెప్పింది. రేటు కొంత తగ్గించి ఇద్దరూ ఒక ఒప్పందానికి వచ్చారు.

లాయర్ కార్సన్ రేఖ చెప్పేది అంతా విన్నాడు. ఆయన సెక్రటరీ నోట్స్ వ్రాసుకోవటమే కాక, వాళ్ళ సంభాషణంతా రికార్డు కూడా చేసింది. తన ఫోన్లో వాసు మెసేజీలు అన్నీ చూపించింది. కార్సన్ అవన్నీ ప్రింటు చేయమనీ, ఫొటోలు తీయమనీ సెక్రటరీకి చెప్పాడు.

"ఇప్పుడే ప్రొటెక్టివ్ ఆర్డరుకి అప్లై చేస్తాను. నీ ఫోన్లో మెసేజీలు చాలు అతన్ని దూరంగా వుంచటానికి. తర్వాత విడాకులు, మిగతావన్నీ చూద్దాం" అన్నాడు.

రేఖకి ఆయన మాటలతో ధైర్యం వచ్చింది.

ఆయన అన్నాడు, "నీకు తెలుసో లేదో. నిన్న మీ దగ్గర వాసు పూర్తి పేరు, అడ్రస్ అన్నీ తీసుకున్నాం కదా. అతని పేరుతో ఏమైనా క్రిమినల్ కేసులు వున్నాయా అని పబ్లిక్ రికార్డుల్లో చెక్ చేశాం. నీ అదృష్టం బాగుంది. నాలుగు నెలల క్రితం అతను ఒక పెద్ద డిపార్ట్మెంట్ స్టోరులో పెద్ద గొడవ చేశాడు. స్టోరులో అతను చాల పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడనీ, టీవీలూ, హోం అప్లయన్సులు పాడు చేశాడనీ, ఎంతో ధననష్టం చేశాడనీ, అక్కడ వున్న సేల్స్ అమ్మాయి మీద అరుస్తూ, సెక్సుయల్ అబ్యూస్ చేశాడని.. ఒకటి కాదు. చాల కేసులు పెట్టారు. ఆరోజు పోలీసులు అతన్ని పట్టుకెళ్ళి జైల్లో వేస్తే, అతనికి వాళ్ళ నాన్న బెయిల్ ఇప్పించి విడిపించాడు. ఆ కేసు నాలుగు నెలలనించీ ఇక్కడ కోర్టులో నడుస్తున్నది. బహుశా మూడు నాలుగు వారాల్లో జడ్జిమెంటు, పనిష్మెంటు రెండూ జరగవచ్చు. ఆ కేసులోని కొన్ని నిజాలు బయటపడితే, అవి మనకి ఉపయోగపడవచ్చు కూడాను. ఈ విషయాలు నీకు ఎంతవరకూ తెలుసు?" అడిగాడాయన.

"ఏదో జరిగిందని వాసూ, అతని నాన్న నెమ్మదిగా మాట్లాడుకుంటుంటేం విన్నాను. నాకు తెలియని సీరియస్ విషయం ఏదో జరిగింది అని తెలుసుగానీ, ఇంత గోల అయిందని నాకు తెలియదు" అన్నది ఆశ్చర్యపోతూ రేఖ.

"చూద్దాం, ఆ కేసు ఎక్కడ తేలుతుందో. అది మనకి ఎంత ఉపయోగపడుతుందో" అన్నాడు లాయర్ మైకేల్ కార్సన్.

రేఖ బయటికి వచ్చేసరికే, అక్కడ పార్కింగ్ లాట్లో ఎదురు చూస్తున్నది వీణ.

కారులో వెడుతూ అక్కడ జరిగిన కొన్ని ముఖ్య విషయాలు చెప్పింది రేఖ.

○ ○ ○

ఇంటికి వెళ్ళి సుమని ఒళ్ళో పడుకోబెట్టుకుని ఆడిస్తున్నది రేఖ.

అప్పుడే ఫోన్ మ్రోగింది. తన ఆఫీసునించీ లీసా పిలుస్తున్నది.

"రేఖా! నువ్వు ఎక్కడైనా మంచి ఎపార్ట్మెంట్ వుంటే చూడమన్నావు కదా. మా కాంప్లెక్సులోనే ఒకటి వారం రోజుల క్రితం ఖాళీ అయిందిట. ఎల్లుండికి రెడీ అవుతుందన్నాడు. సాయంత్రం వస్తామని చెప్పాను. మంచి సెక్యూరిటీ వుంది.

గేటెడ్ ఎపార్ట్మెంట్. కోడ్ నొక్కితేగానీ గేట్ తెరుచుకోదు. వెరీ సేఫ్. రెండు బెడ్రూములుట. నీకు సరిపోతుంది. సాయంత్రం వస్తావా చూడటానికి? సాయంత్రం నన్ను వచ్చి నిన్ను పిక్ చేసుకోమంటావా?" అని అడిగింది.

రేఖ తనకి వున్న రెండు, మూడు ప్రశ్నలు వివరంగా అడిగి తెలుసుకుంది.

"బాగానే వుంది. గేటెడ్ కమ్యూనిటీ. అదే చోట మూడు బిల్డింగుల దూరంలో నువ్వున్నావు. అదీగాక నాకు కారు లేదు కాబట్టి నేను మళ్ళీ కారు కొనుక్కునే దాకా, నీతో రోజూ ఆఫీసుకి వెళ్ళి రావచ్చు. పెట్రోల్ ఖర్చు చెరి సగం పెట్టుకుందాంలే!" అంది రేఖ నవ్వుతూ.

లీసా కూడా నవ్వుతూ, "నువ్వు నాతో వచ్చినా, రాకపోయినా నేను ఎలాగూ ఆఫీసుకి వెళ్ళాలి కదా. నువ్వేమీ అదనంగా ఇవ్వనఖ్ఖర్లేదు!" అన్నది.

"చూద్దాంలేవమ్మా" అంది రేఖ.

"సరే, ఇవాళ సాయంత్రం ఆఫీసునించీ ఇంటికి వెళ్ళేటప్పుడు, నువ్వు వుంటున్న ఇంటికి వచ్చి నిన్ను తీసుకురమ్మంటావా?"

""వద్దులే, నేనే వస్తాను" అన్నది రేఖ.

తల్లి రాజేశ్వరికీ, వీణకీ ఆ విషయాలన్నీ రేఖ ఆనందంగా చెప్పింది.

"ఈరోజు అన్నీ నేను అనుకున్నట్టుగానే జరుగుతున్నాయిరా, సుమా. ఇవాళ మనకి ఎంతో మంచిరోజు" అంటూ తన ఒళ్ళో పడుకుని తననే అమాయకంగా చూస్తున్న పసికందు సుమ బుగ్గ మీద గట్టిగా ముద్దుపెట్టుకుంది.

సుమ ఎర్రటి లేత పెదిమలు కదులుతుంటే మళ్ళీ అన్నది రేఖ, "నీకూ ఇవాళ మంచిరోజే అంటున్నావా? హాయిగా నీ చక్కటి కళ్ళు మూసుకుని బ్రహ్మాండంగా నిద్రపోయావు. నీ బుజ్జి కడుపునిండా పాలు తాగావు. నీ పక్కనే అమ్మమ్మ వుంది. బామ్మ వుంది. నేనున్నాను. ఆఫీసునించీ కాసేపట్లో తాత వచ్చేస్తారు. నీకూ మరి ఇది మంచిరోజే!"

రాజేశ్వరికి అది చూస్తే ముచ్చటగానూ వుంది, కళ్ళల్లో నీళ్ళూ తిరిగాయి.

పక్కకి తిరిగి పమిటె చెంగుతో ఎవరికీ కనపడకుండా కళ్ళు తుడుచుకున్నది.

○ ○ ○

ఊబర్ తీసుకుని వెడదామనుకుంటుంటే వేణు ఆఫీసునించీ వచ్చేశాడు.

"ఎలావుంది మనవరాలు" అంటూ సుమని చేతుల్లోకి తీసుకుని, ఆ పసిపాప కళ్ళల్లోకి చూస్తూ ఏదో మాట్లాడేస్తున్నాడు వేణు.

సుమ కూడా అతని వేలు పట్టుకుని వూపుతున్నది.

"ఈనాటి పిల్లలు మన పిల్లలు నెలల్లో చేసినవి, ఇప్పుడు రోజుల్లోనే చేసేస్తున్నారు" అంది వీణ.

రేఖ చెప్పింది ఊబర్లో ఎపార్ట్మెంటు చూడటానికి వెడతానని.

"ఊబర్ ఎందుకు? నేనూ వస్తాను పద, నా కారులో వెడదాం" అన్నాడు వేణు.

పది నిమిషాల్లో ఇద్దరూ ఎపార్ట్మెంటు చూడటానికి బయల్దేరారు.

"ఎపార్ట్మెంటుకి అంత హడావిడి ఎందుకు? మా దగ్గరే కొన్నాళ్ళు వుండొచ్చు కదా!" అన్నాడు వేణు.

"లేదు అంకుల్. ఇప్పటికే మీకు ఎంతో శ్రమ యిస్తున్నాను. ఇది ఎన్నాళ్ళకి తేలుతుందో కూడా తెలియదు. అంతేకాదు మీ సహాయం, సలహాలు, ఆశీర్వాదాలు నాకు ఎప్పుడూ కావాలి" అంది రేఖ.

వేణు ఏమీ మాట్లాడలేదు.

రేఖ వేపు ఆప్యాయంగా చూసి తల వూపాడు.

"ఇంతగా ప్రేమ, అనురాగం పంచుకునే ఇలాటమ్మాయి కూతురుగా వుండాలని ఏ తండ్రి కోరుకోడూ!" అనుకున్నాడు మనసులో.

కారులో ఎపార్ట్మెంటుకి వెళ్ళేటప్పుడు ఆరోజు జరిగిన విశేషాలన్నీ చెప్పింది రేఖ.

"ఈరోజు అన్నీ నువ్వు అనుకున్నట్టుగానే జరుగుతున్నాయి. శుభమస్తు!" అన్నాడు వేణు.

లీసా కూడా ఎపార్ట్మెంట్ ఆఫీసులో కూర్చుని రేఖ కోసం వేచి వున్నది.

అక్కడి మేనేజర్ ముగ్గుర్నీ ఎపార్ట్మెంటు దగ్గరికి తీసుకువెళ్ళింది.

రెండవ అంతస్థులో ఒక మూలగా వుంది. చుట్టూ పెద్ద పెద్ద చెట్లు మంచి నీడని ఇస్తున్నాయి. ఎపార్ట్మెంటు బాగుంది. రెండు బెడ్రూములు, హాల్, కిచెన్, రెండు బాత్రూములు. అద్దె కూడా మరీ ఎక్కువ కాదు.

రేఖకీ, వేణుకీ, లీసాకీ కూడా నచ్చింది.

"నాకు బాగుంది. తీసుకుంటాను. ఎప్పటికి సిద్ధమవుతుంది?" అడిగింది రేఖ.

"ఒకటి రెండు చోట్ల చిన్న పెయింట్ టచప్ పని మిగిలింది. రేపు సాయంత్రానికి క్లీనింగ్ కూడా పూర్తయి అంతా సిద్ధం అవుతుందని అనుకుంటున్నాం. ఇవాళ పేపర్ వర్క్ పూర్తి చేసుకుంటే, ఎల్లుండి ప్రొద్దున్నే మీదవుతుంది. తర్వాత ఎప్పుడు దిగాలంటే అప్పుడు రండి" అన్నది మేనేజర్.

"సరే" అని లీజ్ కాగితాల మీద సంతకాలు పెట్టేసి, అడ్వాన్స్ కూడా కట్టేసింది రేఖ.

"ఇదిగో మీ గేట్ కోడ్. మీ కోసం వచ్చేవాళ్ళు ఈ కోడ్ నొక్కితే గేట్ తెరుచుకుంటుంది. మీరయితే మీ సెల్ ఫోన్ నించీ తెరవచ్చు. మూయవచ్చు ఇదిగో కోడ్. తాళాలు ఎల్లుండి మీరు రాగానే ఇస్తాను" అన్నది మేనేజర్.

లీసాకి ధన్యవాదాలు చెప్పి వేణూ, రేఖా బయల్దేరారు.

పక్కనే వున్న పెద్ద గ్రోసరీ షాపుని చూసి అన్నాడు వేణు.

"గ్రోసరీ షాపుకూడా పక్కనే వుంది. ఆఫీసుకి లీసాతో వెళ్ళవచ్చు. కారు కొనటం ఆలస్యం అయినా ఫరవాలేదు. అన్నిటికీ మించి ఎపార్టుమెంటుకి మంచి సెక్యూరిటీ వుంది. గుడ్" అన్నాడు.

ఆరోజు రాత్రి రేఖ తండ్రి మురళికి ఫోన్ చేసి, జరుగుతున్నవన్నీ వివరంగా చెప్పింది.

ఆయన రేఖతో, రాజేశ్వరితో కూడా చాలసేపు మాట్లాడాడు.

"రాజీ, ఒక్కసారి ఫోన్ వేణుగారికీ, వీణగారికీ కూడా ఫోన్ ఇస్తావా? వారితో మాట్లాడతాను" అన్నాడు మురళి.

వేణు ఫోన్ తీసుకున్నాడు.

మురళి కొంచెం భావోద్వేగంతో వున్నాడేమో ఒక్క క్షణం మాట్లాడలేదు.

తమాయించుకుని అన్నాడు.

"మీకు ఎన్ని ధన్యవాదాలు ఎలా చెప్పుకోవాలో తెలియటం లేదు. మాకు ఒక్కగానొక్క అమ్మాయి. దూరదేశంలో ఈ పిన్న వయసులోనే ఎన్నో బాధలు పడుతున్నది. మీరు సరిగ్గా సమయానికి ఆదుకుని సహాయం చేస్తున్నారు. మీరూ, అక్కయ్యగారూ రేఖని మీ కూతురులాగానే చూసుకుంటున్నారు" అన్నాడు మురళి.

"ఈ పరిస్థితిలో ఎవరైనా ముందుకు వచ్చి ఇలాగే సహాయం చేస్తారు మురళిగారు. మాదేముంది" అన్నాడు వేణు.

"ఈరోజుల్లో మీలాటి మంచివారు ఎంతమంది వుంటారండి" అన్నాడు మురళి.

"రేఖ మంచి తెలివైన అమ్మాయి. ఎన్ని ఒడుదుడుకులున్నా, త్వరత్వరగా తగిన పరిష్కారాలు చేసుకుంటూ ముందుకు వెళ్ళే గుణం వుంది ఆమెలో. ఆ సద్గుణమే ఆమె జీవితాన్ని సవ్యమైన మార్గంలో నడిపిస్తుంది. నాలాటి వాళ్ళు చేసేది కేవలం మాట సాయం. ఒక పెద్ద తలకాయ నా పక్కనే వుంది అనే మానసిక ధైర్యం. అంతకన్నా ఏమీలేదు" అన్నాడు వేణు.

మురళి కాసేపు వేణుతో మాట్లాడి, వీణతో కూడా మాట్లాడాడు.

తర్వాత మురళి రాజేశ్వరితో మాట్లాడేటప్పుడు, "వేణు వీణా ఎంతో సహృదయులు. మంచి దంపతులు. స్వంత అన్నదమ్ములే కొట్టుకు చచ్చే ఈ రోజుల్లో, మనమెవరో తెలియకపోయినా కూడా ఇటు సహాయం ఒకటే కాదు, మన అమ్మాయి మీద ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. ధైర్యం యిస్తున్నారు. ఇలాటి క్లిష్ట సమయాల్లో కావసినవి ఆ రెండే రెండు. ప్రేమ. ధైర్యం" అన్నాడు.

ఆరాత్రి పడుకోబోయేటప్పుడు, వేణుతో వీణ అన్నది.

"రేఖ ఎంతో మంచి పిల్ల. ఆమెని విపరీతంగా ప్రేమించే తల్లిదండ్రులు. సాఫీగా వెడుతున్న వారి జీవితంలో జరిగిన ఒకే ఒక సంఘటన, వారి సుఖ జీవితాలని ఎలా మార్చేసిందో చూశారా. అమెరికా నించీ ఇలా వచ్చి, అలా చూసి వారం

రోజుల్లో పెళ్ళిళ్ళు చేసుకునే ముందు ఎంతో ఆలోచన అవసరం. అది లోపించినప్పుడే ఇలాటి అనర్ధకాలు జరిగేది" అంది వీణ.

"ప్రతి చీకటి రాత్రీ తెల్లవారుతుంది. వెలుగుని చూస్తుంది. మనందరి జీవితాలూ అంతే వీణా. రేఖ కూడా ఆమె జీవితంలో మళ్ళీ సూర్యోదయం అయాక సుఖంగా వుంటుంది" అన్నాడు వేణు ఆవలిస్తూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments